

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

### నాగలింగం కడుపునొప్పి

అగ్రహారం మొదట్లో కొద్దిగా విసిరేసినట్టుగా ఉండే నాలుగిళ్ళలో, ఊరివైపునించి మొదటిది నాగలింగానిది. మిగతా మూడూ, అతని తమ్ముళ్ళవి. వాళ్ళందరూ గత మూడు తరాలుగా కంసాలి పనిలో ఉన్నారు. ఒక్క అగ్రహారానికే కాదు, చుట్టుపక్కల ఉన్న పది వూళ్ళకీ వాళ్ళే నగలపని చేస్తూ ఉంటారు. నాగలింగం సన్నగా రివటలా పొడుగ్గా ఉంటాడు. ముక్కుమీదకి జారిన కళ్ళజోడుతో డెస్క్ మీద చిన్న లైటు పెట్టుకుని పని చేస్తూ ఉంటాడు. సన్నగా పొడవుగా ఉండే అతని చేతి వేళ్ళలో బంగారం తిరగని వంపు కాని, మెలిక కానీ లేదని చెప్పుకుంటారు. బంగారాన్ని సుతి మెత్తని నాజుకు తీగలుగా చేసి వాటితో ఓర్పుగా, నేర్పుగా జిగినీలు అల్లి అందంగా గొలుసులూ, నెక్లస్‌లూ చెయ్యడంలో నాగలింగానిది ఓ ప్రత్యేకత. అతనికి చెయ్యడానికి వీలు పడకపోతే, పానీలే దగ్గర్లో ఇంకేదయినా మంచి ముహూర్తం పెట్టుకుందామా అని పెళ్ళిపెద్దలు ఆలోచించిన సందర్భాలు ఉన్నాయంటే పెద్ద ఆశ్చర్యం కాదు. నిఖార్సయిన మనిషి. ఆడిన మాట తప్పడం, కల్తీ పని చెయ్యడం అతనికి తెలీదు. చెప్పిన పని చెప్పిన వేళకి చెప్పినట్టుగా చెయ్యడం మాత్రం అతనికి తెలుసు. రాత్రి వేళ బంగారు తీగలు అతని చేతుల్లో నాజుకుగా హొయలు పోతూ మెరిసిపోతూ వివిధ ఆ భరణాలలో అమరిపోతుంటే చూసేవాళ్ళకి గొదావరి నీళ్ళల్లో వెన్నెలమ్మ కిరణాలను చూస్తున్నంత హాయిగా ఉంటుంది.

పెద్దరుగుల సుబ్బారావు గారి పెంపుడుకొడుకే అబ్బులుగారు. సుబ్బారావు గారిది చాలా ఎత్తైన పెద్ద అరుగుల ఇల్లు. పెద్దవరదలకి కూడా వాళ్ళ అరుగులు మునగలేదని చెప్పుకుంటారు. వాళ్ళ ఇంటిపేరు అది కాకపోయినా అందరూ ఆయన్ని అలాగే పిలుస్తారు. అతనికి కొడుకులు లేకపోవడంతో తమ్ముడి కొడుకైన అబ్బులుని పెంచి దత్తత చేసుకున్నారు. అలా ఇద్దరు తండ్రుల ఆస్థి కలిసి అబ్బులుగారు ఊర్లో కెల్లా ఆస్థిపరుడు అయ్యారు. ఆయనకి నలుగురు పిల్లలు, ఇద్దరు ఆడవాళ్ళూ, ఇద్దరు మొగవాళ్ళు. ఆయన

ఆఖరి పిల్ల నాగమణి పెళ్ళి. అసలే గొప్పవారింటి పెళ్ళి అందునా అబ్బులు గారింట్లో ఆఖరి పెళ్ళి. హడావుడికి లోటేముంది? పెళ్ళి పది రోజులుందనగానే వారింటికీ, విడిదింటికీ కూడా సున్నాలు వేయించడం, రాజమండ్రీ నుంచీ పెయింటర్‌ని తెప్పించీ గడపలకి చక్కగా పసుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ ఇలాంటి ముదర రంగులతో అందమైన డిజయిన్లు వేయించడం లాంటి పనులు పూర్తయ్యాయి. రెండిళ్ళముందూ చక్కని పెద్ద పందిర్లు వేయించారు. స్తంభాలకి ట్యూబ్ లైట్లు పెట్టించారు. పిల్లలు స్తంభాలని పట్టుకుని గొల్ల స్తంభాలు ఆడుకుంటుంటే షాక్ కొడుతుంతేమోనని పెద్దవాళ్ళు కోప్పడుతున్నారు.

పెళ్ళికి చెయ్యవలసిన నగలన్నీ లిస్టు రాసిపెట్టుకున్నాడు నాగలింగం. మువ్వల వడ్డాణం, ఎనిమిది జతల గాజులూ, చంద్రహారాలు, పలకసర్లూ, వాణిశ్రీ నెక్లెస్ వగైరాలు. అబ్బులుగారికి నాగలింగానికి పాతికేళ్ళుగా అనుబంధం. ఆయన ఏనాడు తన చేత్తొ బంగారం కొని ఎరగడు. ఏం కావాలో నాగలింగానికి చెప్తాడు, డబ్బు ఇస్తాడు మిగతా పనంతా నాగలింగానిదే ఏనాడూ ఎంత బంగారం కొన్నావు అని గానీ, ఎంత మిగిలింది అని గానీ ఆయన అడగనే అడగడు. అయినా నాగలింగం లెక్కలన్నీ ఖచ్చితంగా వేసి చూపిస్తాడు. ఆయన ' సర్లేరా! నీకూ నాకూ మధ్య లెక్కలేమిటి? బంగారం మిగిలితే నీ దగ్గర ఉంచు, తరవాత పనికి ఉంటుంది, డబ్బు తగ్గితే మాత్రం అడుగు, ఇస్తాను వస్తువులు ఆడవాళ్ళకి నచ్చాయో లేదో మాత్రం కనుక్కో' అంటారు. ఇలాగే జరుగుతోంది ఇన్నేళ్ళుగా.

నాగలింగం భార్య స్వరాజ్యం. వాళ్ళకి ముగ్గురు పిల్లలు, పెద్దవాళ్ళిద్దరూ మగపిల్లలు. స్వరాజ్యం పట్టుమేరకు రాజమండ్రీలో వాళ్ళ చెల్లెలి ఇంట్లో ఉంచి చదివిస్తున్నాడు. మూడోది ఆడపిల్ల కనకమహాలక్ష్మి అని తన తల్లి పేరు పెట్టుకున్నాడు. పిల్ల అంటే తగని గారం అతనికి. కనకం అని పిలుస్తూ ఎంతో ముద్దుగా చూసుకుంటాడు.

మంచినీళ్ళు తెచ్చిన స్వరాజ్యాన్ని అడిగాడు. 'కనకం పడుకుందంటే?' అని

' ఎప్పుడో! ఇప్పటికి మూడో ఝాము నిద్దర్లో ఉంది. అయినా టైము ఎంత అయ్యిందో అయ్యగారికి తెలుస్తేగా? ' అంది ఆమె.

'అదేంటే అలాగంటావు? మణెమ్మ పెళ్ళికదా! నగలిస్తే కానీ కుదరద్దు కదా? కెంపులేసి వాణిశ్రీ నెక్లెస్ చేసిమ్మని మరీ మరీ అడిగింది మణెమ్మ. చూసావా? దానిమ్మ గింజల్లాగా ఎల మెరిసిపోతున్నాయో? ' అన్నాడు

'సర్లే! నాకు నిద్రొస్తోంది, నే పోతున్నా ' అంటూ పోయి పిల్ల పక్కన వాలింది.

దీపం వెలుగులో పతకంలో కెంపులమర్చడంలో పడ్డాడు.

అబ్బులుగారింట్లో గాడిపొయ్యి తవ్వించారు. పెళ్ళి వారం రోజుల్లోకి రావడంతో చుట్టాలు రావడం మొదలయింది. అబ్బులుగారి భార్య శ్రీదేవమ్మ గారు అక్కచెల్లెళ్ళూ, ఆడపడుచులతో కలిసి ఊరేగింపుగావెళ్ళి ఊర్లో అందరికీ నూనే, పసుపూ కుంకుడుకాయాలూ పంచడానికి బయలుదేరారు. మాములుగా అయితే ఇంటివాళ్ళని పళ్ళెం ఇవ్వమని అడిగి, దాంట్లో వెయ్యవలసినవన్నీ వేసి బొట్టు పెట్టి ఇస్తారు. అయితే అబ్బులుగారింట్లో అన్నీ వాళ్ళే తెస్తారు. ఇంటికో కొత్త స్టీల్ పళ్ళెంలో పసుపూ, కుంకుడుకాయలు, సున్నిపిండి పెట్టి, కొత్తకప్పులో నూనే వేసి బొట్టు పెట్టి, తాంబూలం తో పాటు ఇంటికో చీర పెడతారు. 'ప్రతీసారీ చీర మర్చిపోరుకదా! 'అని ఎవరైనా అంటే, 'అదేమ్మాట చెప్పండి! మా మణెమ్మ పెళ్ళి అంటే మాఇంట ఆఖరి కార్యం కదా! ఏదో దేవుడు మాకిచ్చినంత మటుక్కు' అంటుందావిడ. ' పెళ్ళి జరిగిన మూడు రోజులూ మా ఇంట్లోనే భోజనాలు, టిఫిన్లూ, పొయ్యి వెలిగిస్తే ఊరుకునేది లేదు ' అని ఆదరంగా పిలుస్తుంది అందరినీ. అందుకే ఊర్లో వాళ్ళు అంటుంటారు. పట్నాన పెరిగినా, ఆవిడ మర్యాద, మన్ననా వేరు అని. శ్రీదేవమ్మ నాన్నగారు వాళ్ళ చిన్నతనాన మెడ్రాస్‌లో ఉండడం మూలాన మాములుగా సుబ్బలక్ష్మి, సూర్యకాంతం ఇలాంటి పేర్లు కాకుండా ఆవిడ అక్కచెల్లెళ్ళు ముగ్గురికీ కూడా శ్రీదేవి, ఇందిర, శకుంతల ఇలా నాజూగ్గా ఉండే పేర్లు పెట్టారుట. వాళ్ళు కూడ ఎప్పుడూ చక్కగా తయారయ్యి నవ్వుతూ అందరితో ఎంతో కలివిడిగా ఉంటారు. పంపకాలు అయిన నాటి రాత్రి ఆడవాళ్ళందరూ చేరి గాడిపొయ్యి దగ్గర

మినపసున్ని మిఠాయి ఉండలు నొక్కుతున్నారు. వాసనలకి వాకిలంతా పరవశించిపోతోంది. ‘తినకుండా ఎలా వంట చెయ్యగలరో - ఆడవాళ్ళు అని మగవాళ్ళు ఆశ్చర్యపడుతూనే రుచులడుగుతున్నారు‘. దగ్గర్లో ఉన్న టవున్ నించీ గంటి వారి బాచీ, మాస్టారి సూరిబాబు వెళ్ళి పెళ్ళినాటి వరకు సరిపడా కూరలన్నీ కొనుక్కొచ్చారు. గడ్డిమీద పరిచి కొద్ది కొద్దిగా నీళ్ళు చిలకరిస్తూ అరటి ఆకులు కప్పి వాటిని తాజాగా ఉంచుతున్నారు. సుబ్బయ్య కొట్లో ఓ పది గ్రాముల పచ్చిమిరపకాయలకి మించి దొరకవు మరి ఆ ఊర్లో.

వీణ, సితార తీగల మీద రాగాలు పలికించడం కళే అయితే పుటం పెట్టి చనిమిడి ముద్దలాంటి బంగారాన్ని తీగలుగా సాగించి నగలందాల తళుకులు అద్దడం తక్కువ కళేమీ కాదు. బ్రహ్మాండంగా కుదిరిన వడ్డాణానికి చివరి రింగు పెడుతున్నాడు నాగలింగం. అప్పుడే సరిగ్గా వచ్చి అతని చెవిలో వేసింది ఈముక్క స్వరాజ్యం.

‘నిజమేనే? ఎలా ఉంది కనకం? జ్వరం గిరం రాలేదు కదా? ముహూర్తం చూసావా? మంచి రోజే కదా?? ‘ అని హడావుడిగా అడిగాడు.

‘ఓ! అవన్నీ నేను సత్యవతీ చూస్తున్నాములే, పిల్లపేరుమీద అందరికీ భోజనాలెట్టాలి కదా? అది మణెమ్మ పెళ్ళి అయిన మూడోనాడు అంది.

‘భోజనాలకేంటే? ఊరందరికీ పెట్టేద్దాం‘ అన్నాడు. .

‘భోజనాలు సరే! ఆ రోజుకైనా పిల్లదాని మెడలోకి ఏదైనా వెయ్యద్దా? ఇంత పెద్ద బంగారప్పనోడి కూతురు మళ్ళీ!‘ అంది. నాగలింగం ఆలోచనలో పడ్డాడు.

‘దానికేం భాగ్యం? ఒక్క రాత్రి కూర్చుంటే మూడు పేటల చంద్రహారం చేసేస్తాను‘ నవ్వుతూ అన్నాడు.

‘ఏం పెట్టి? ‘

వెక్కిరింతగా అందో? నిజంగా అందో తెలియలేదు అతనికి.

‘నీకు గుర్తుందా మీ అమ్మ మాట‘ గుర్తు చేసింది.

అత్తగారంటే స్వరాజ్యానికి చాలా ఇష్టం. ముగ్గురు పిల్లలు పుట్టిన తరవాత కూడా తనని చిన్న పిల్లలా, కన్నకూతుర్లా చూసుకున్నా అత్తగారి మాట వేదవాక్కు ఆమెకి. పోతూ పోతూ ఆవిడ ‘స్వరాజ్యం చెయ్యి పట్టుకుని ‘ఒలే స్వరాజ్యం! నా పని అయిపోయింది, నేను వెళ్ళిపోతున్నాను, కనకాన్ని జాగ్రత్తగా చూసుకోండి. దాని కే లోటు జరిగినా నాకు జరిగినట్టే అనుకోండి. రేపో మాపో పిల్ల పెద్దది అవుతుంది, వాడుత్త వెర్రిబాగులోడు, నువ్వేమో మీ నాన్న గాంధీ గారి దారిపట్టడం వల్ల ఇవేమీ పట్టించుకోవు., నగలూ నాణ్యాలు అక్కర్లేదంటావు ఆడపిల్లన్నాకా అన్నీ కావలిగందా? ఇదిగో! నా దగ్గర దాచుకున్న మూడు కాసుల బంగారం, దీనికింకో మూడొ నాలుగో కాసులు వేసి పిల్ల పెద్దదై భోజనాలు పెట్టే నాటికి దాని మెళ్ళోకి నా గుర్తుగా మూడు పేట్ల చంద్రహారం చేయించండి, ఈ ముసలిదాని మాట మర్చిపోవద్దు ‘ అని చేతిలో చెయ్యి వేయించుకుంది. అందుకే స్వరాజ్యానికి పిల్లకి తప్పకుండా చంద్రహారం చేయించాలని తాపత్రయం. ‘మూడు కాసులకేముచ్చుద్దే? కనీసం ఇంకో రొండు మూడు కాసులన్నా కావాలి గదా! తరవాత చూద్దాంలే‘ అన్నాడు. స్వరాజ్యానికి ఉక్రోషం తన్నుకు వచ్చింది. ఒక్కగానొక్క పిల్ల, అత్తమ్మ కోరక కోరక కోరిన కోరిక..

మూడు రోజుల్లో పెళ్ళి. గాజుల వీర్రాజు వచ్చాడు. చెంబుడు నీళ్ళు తాగి తువ్వాలుతో మొహం తుడుచుకుని అరుగు మీద పరిచిన చాప మీద కూర్చుని మెల్లగామూట విప్పి గాజుల దొంతరలన్నీ వరసగా పరిచాడుచాప మీద. ఎరుపు, నీలం, కెంపు రంగు, రంగు రంగుల హరివిల్లులా ఉంది గాజుల మల్లారం. ‘మణెమ్మ గారిది పసిమి చాయ, ఏ రంగు వేసినా నప్పేసుద్ది అని నవ్వుతూ, పెళ్ళి కూతురుకి ఎరుపు శుభం కదా? ‘ అని ఎరుపు కెంపు రంగు గాజులు నాగమణి చేతుల్నిండా వాటంగా తొడిగాడు. ‘మళ్ళీయేడు ఈనాటికి శీమంతానికి గాజులేయించుకోవలి తల్లీ ‘ అన్నాడు నవ్వుతూ. గాజుల మల్లారానికి దండం పెట్టుకుని లోపలికి పరిగెత్తింది

సిగ్గుతో పెళ్ళికూతురు. తరవాత వరసగా అందరికీ వాళ్ళు కోరిన గాజులు వేసి, చిన్నపిల్లలకి రబ్బర్ గాజులు వేసాడు, శ్రీదేవి గారు ఇచ్చిన డబ్బు పుచ్చుకుని, దండం పెట్టి వెళ్ళాడు. ఎల్లుండి పెళ్ళనగా కుదిరింది పెళ్ళికూతుర్ని చేసే ముహూర్తం.

'పోనీ నేనో మాట చెప్పనా? ' నాగలింగాన్ని అడిగింది స్వరాజ్యం.

'ఏటది? 'అన్నాడు. చివరగా నక్లెస్ చేస్తున్నాడు.

'అబ్బులుగారిని ఓ మూడు కాసులు అడిగితేనో? ' అంది.

'ఏనాడు ఎవ్వర్నీ ఏమీ అడగలేదు నువ్వూ నేనూ, ఇప్పుడు మాత్రం ఎలా అడుగుతాం? అదీకాక ఆయన ఎంత బిజీగా ఉన్నాడో తెల్సు కదా ఇప్పుడేటి అడిగేది? ఏం బాగుంటది? 'అన్నాడు చిరాగ్గా.

'పోనీ ఆయన బంగారం నీ కాడే ఉంటాది కదా! ఓ మూడు కాసులేసి పిల్లదాని గొలుసు చేసెయ్యి, తరవాత పెట్టెయ్యవచ్చు కదా ' అంది.

'నోర్ముయ్! ఏం మాట్లాడుతున్నావో తెలిసే అంటన్నావా? దరమరాజులాంటోడు అబ్బులుగారు, నన్ను నమ్మి ఇన్నేళ్ళుగా పని ఇస్తున్నాడు, అలాంటి ఆయనకి.. చ.. నీకు ఇలాంటి ఆలోచనెలాగొచ్చిందే? ' అన్నాడు.

'తప్పేటున్నాది? మళ్ళీ పెట్టేస్తాం కదా? పూరాగా తీసేసుకుంటామా ఏటి? ' అంది.

నాగలింగం మాట్లాడలేదు. అతనికి ఇష్టం లేదని ఆమెకి తెలిసింది. కానీ ఊరుకోవడానికి ఆమె తల్లి మనసు అడ్డు వచ్చింది. తల్లి లాంటి అత్తమ్మ, ఆమెకిచ్చిన మాట అడ్డు వచ్చాయి. 'మా అమ్మ పేరు, మా అమ్మే ఇది అందుకే ఇంత అత్తారబత్తంగా చూసుకుంటన్నాం అనడమే గానీ ఏ ముచ్చటైగా తీర్చామా? నేనేడాయినా నాకేమయినా కావలన్నానా? అత్తమ్మ కి పోయేటప్పుడు ఒట్టుపెట్టాం గదా! అది నిలిపే పూచీ మనది కాదా? ' ఇలా చెపుతూనే ఉంది రాత్రి చాల పొద్దు పోయేదాకా.

ఎల్లుండే పెళ్ళి. అబ్బులుగారింట్లో హడావుడి చెప్పనలవి కాకుండా ఉంది. పెద్ద పెద్ద గుండిగలూ, పులుసు గోకర్ణాలు నేతి జారీలూ, ఇత్తడి పళ్ళాలూ, గంగాళాలు వగైరాలన్నీ అటక మీదనించి దింపి చింతపండేసి మెరిసిపోయేలా తోమి నూతి పళ్ళెం లో బోర్లిస్తే పెరడంతా పసిడి కాంతులు. పెళ్ళికూతురిని చేసిననాడు ఊరంతా భోజనానికి వచ్చారు. కాకినాడనించీ కాజాలు అవీ చేసేవాళ్ళని తెప్పించారు. మిగతా వంటకి నేదునూరు లో బాగా పేరు పడ్డ పొట్టికామన్న గారిని రప్పించారు. 'ఈ భోజనమే ఇంత గొప్పగా ఉంటే ఇంక పెళ్ళికేం పెడతారో? 'అనుకున్నారు ఊరి జనం. మర్నాడే మగపెళ్ళివారు విడిదింట్లో దిగడం. సామాన్లన్నీ లెక్క చూసుకుంటున్నారు శ్రీదేవమ్మ. అబ్బులుగారింట్లో నగలన్నీ అప్పచెప్పేసి, మెరిసిన మణెమ్మ కళ్ళు చూసి ఆనందంతో అబ్బులుగారి దగ్గరకొచ్చి లెక్క చెప్పబోతుంటే. 'నీకెన్ని సార్లు చెప్పాన్రా లింగం! లెక్కలన్నీ నీ దగ్గరే ఉంచు. డబ్బు తక్కువైతే అడుగు, పిల్లకినచ్చిందా లేదా అడుగు అంతే! అవతల రేపే పెళ్ళివారు వచ్చేది' అని హడావుడిగా వెళ్ళిపోయారు. నాగలింగం నెమ్మదిగా ఇంటికి వచ్చాడు.

ఆ రాత్రి చంద్రహారానికి లక్ష్మీదేవి బిళ్ళ చెక్కుతున్న వాడు కాస్తా 'అమ్మా! ' అంటూ ఎడంవైపు చాతీ పట్టుకుని వెనక్కు విరుచుకు పడిపోయాడు.

'ఏమయిందయ్యా? ' స్వరాజ్యం పరుగున వచ్చింది.

అంత పొడుగు మనిషీ కింద పడిపోయి గుండె పట్టుకుని విలవిలలాడిపోతున్నాడు. స్వరాజ్యానికి కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఎప్పుడూ చిరునవ్వుతో తన పనేదో తనుగా ఉండే భర్తని స్థితిలో చూసేసరికి మె తల్లడిల్లి పోయింది.

'భద్రం! ఓ పాలొచ్చి మీ అన్నయ్యని చూడు' అని పక్కనే ఉన్న పెద్ద మరిదిని పిలిచింది.

మొహం మీద నీళ్ళు చల్లి భద్రం రాగానే గవరయ్యగారికి కబురెట్టింది. మొహాన నీళ్ళు చల్లిన దాదాపు పది నిమిషాలకి కొద్దిగా కళ్ళు విప్పిన నాగలింగం ' అబ్బులుగారు, అబ్బులుగారు ' అన్నాడు.

గవరయ్యగారు వచ్చి నాడి చూసి, ‘అంతా బానే ఉందే !‘ అన్నాడు.

నాగలింగం అబ్బులుగారి పేరు తలవడంతో అంతా అర్థమైపోయింది స్వరాజ్యానికి.

చిన్న మరిది శంభులింగాన్ని ‘శంభూ! ఓ పాలెల్లి అబ్బులుగారిని కేకేసుకురా! పరిస్థితి అంతా చెప్పు, ఉన్నపళాన ఆర్నీ ఎంటెట్టుకుని రా‘ అంది.

ఉండుండీ నాగలింగానికి నొప్పి ఎక్కువ అవుతోంది, బాధతో గిలగిల లాడుతున్నాడు. ‘అబ్బులుగారు! ‘ అన్న మాట మాత్రం వస్తోంది అతని నోట్లోంచి.

పదినిముషాల్లో అబ్బులుగారు వచ్చారు అక్కడకి. ‘ఏమిట్రా? ఏమయింది?‘ అంటూ.

‘సాయంత్రం నగలిచ్చినప్పుడు చక్కగా ఉన్నాడు, ఇంతలో ఏమయిందమ్మా? ‘ అన్నారు స్వరాజ్యాన్ని చూస్తూ.

‘నన్ను క్షమించండి అబ్బులుగారూ! పాపిష్టిదాన్ని పిల్లదాని ముచ్చటా, పెద్దదానికిచ్చిన మాట అంటూ ఈ మనిషిని ఇబ్బందెట్టాను‘ అంటూ మొదలుపెట్టి దాచకుండా విషయం అంతా చెప్పింది.

‘ఎప్పుడూ ఏ తప్పు పనీ చేసెరగడు, ఒకరినీ అనడు, అనిపించుకోడూ. అలాంటివాడు ఇప్పుడు నా వల్లే ఇలా.. ‘ ఏడవడం మొదలు పెట్టింది ‘అబ్బులుగారు మీరే కాపాడాలండే! ‘ అంటూ.

‘నాగలింగం!‘ అని గట్టిగా పిలిచారు అబ్బులుగారు.

ఆయన మాటకి నాగస్వరం విన్న పాములాగా కళ్ళు విప్పాడు.

‘వచ్చారా అబ్బులుగారూ! చూసారా! నేనెంత పని చేయబోయానో? ‘ గద్గదమైన మాట ముద్దగా వస్తోంది. ‘నన్ను చమిస్తారా?‘ అని దండం పెట్టిన అతని చేతిని మెత్తగా పట్టుకుని లేపి కూర్చోబెట్టారు అబ్బులుగారు.

‘మన కనకం పెద్దపిల్లయిందన్నమాట. పెళ్ళి అయిన రెండురోజులకే భోజనాలుట కదా, స్వరాజ్యం చెప్పింది. నువ్వుచెప్పకపోతే నాకు తెలీదనుకున్నావా? నేనే పిల్లకి మిగతాది వేసి చంద్రహారం చెయ్యమని నీకు చెప్పమన్నాను. పాతికేళ్ళ అనుబంధం మనది, నేనామాత్రం ఇవ్వతగనా? నువ్వు అడగతగవా? ఇప్పుడు చెప్తున్నాను విను. మొత్తం నగకి పట్టే బంగారం, భోజనానికయ్యే ఖర్చు నాదే. ఎంత కావాలో రేపు వచ్చి తీసుకో. ఎంత నమ్మకస్తుడైన కంసాలి అయినా సరే చింతాకంతాయినా తనకోసం దాచుకోకపోతే వాడికి కడుపు నొప్పి వస్తుందనీ అందుకే రాగి కొద్దిగా ఎక్కువ కలిపి బంగారం నొక్కేస్తారని అంటారు. అలాంటివి తెలియని నీకు నా బంగారం అవసరానికి వాడుకోవచ్చు అన్న ఆలోచనకే వచ్చింది ఈ గుండె నొప్పి.. కాదు మనసు నొప్పి. నీతి నిజాయితీల పుటం లో నిత్యం శుద్ధి అయిన మనసు నొప్పి. అమ్మా! వీడికి వేడిగా ఏదైనా తాగించు, ఇంకో గంటలో మామూలు మనిషి అవుతాడు‘ నవ్వుతూ అన్నారు అబ్బులుగారు.

నాగలింగం కళ్ళల్లో నీళ్ళు. మనిషి కొద్దిగా తెరిపిన పడ్డాడు. అబ్బులుగారికి చేతులు జోడించాడు. మూడో నాడు మణెమ్మ పెళ్ళి, దానికి రెండు రోజుల తరవాత నాగలింగం ఇంట్లో భోజనాలు బ్రహ్మాండంగా జరిగాయి. నిజాయితీకి మారుపేరుగా నాగలింగం గురించి ఇప్పటికీ అగహారంలో చెప్పుకుంటారు.

